సాక్షి
మహబూబాబాద్

శనివారం | 14 | డిసెంబర్ | 2024



చదరంగ కీర్తి.. గుకేశ్ స్ఫూర్తి

సరదాగా స్నేహితులతో కలిసి సినిమాలు, షికార్లు చేసే వయసులో చెస్‌లో జగజ్జేతగా నిలిచాడు. 18ఏళ్ల అతి పిన్న వయసులో గుకేశ్ చరిత్రను తిరగరాశాడు. - 8లో▸



ఉద్యాన పంటలకు భవిష్యత్

ఉద్యాన పంటలకు మంచి భవిష్యత్ ఉందని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ (వీసీ) డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.9⁰ /14.1⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ధరణి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉదయ్

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో శుక్రవారం ధరణి ఉద్యోగుల సమావేశం నిర్వహించి సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లాలోని 18 మండలాలకు చెందిన ధరణి ఫీల్డ్ టెక్నికల్ సిబ్బంది (ఎఫ్‌టీఎస్)పాల్గొనగా ఓటింగ్ పద్ధతిలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కురవి ఎఫ్‌టీఎస్‌గా పని చేస్తున్న ఐ.ఉదయ్‌ని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ధరణి జిల్లా కోఆర్డినేటర్ పూసపాటి సురేష్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా చిన్నగూడూరు ఎఫ్‌టీఎస్ కె .వినయ్‌ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఉదయ్ మాట్లాడుతూ.. ధరణి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వసతిగృహం తనిఖీ



గార్ల: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచిన నేపథ్యంలో వసతిగృహాల్లో శనివారం తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి సంబురాలు నిర్వహించుకోవాలని వార్డెన్లకు సూచించారు. ఎంపీడీఓ మంగమ్మ, పంచాయతీ కార్యదర్శి అజ్మీరా కిషన్ తదితరులు ఉన్నారు.

మెరిట్ జాబితా విడుదల

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు భర్తీకి సంబంధించిన తాత్కాలిక మెరిట్ జాబితాను జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ మురళీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును భర్తీ చేస్తామని, ఈ నెల 13నుంచి 16వ తేదీ వరకు అభ్యంతరాలు తెలియజేయాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జాబితాను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.మహబూబాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ లోనూ పొందుపర్చడం జరిగిందని తెలిపారు.

లిటిల్ టీచర్ కాన్సెప్ట్‌ను పెంపొందించాలి

డీఈఓ రవీందర్‌రెడ్డి



కురవి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో లిటిల్ టీచర్ కాన్సెప్ట్‌ను పెంపొందించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో దాత బుక్క వీరన్న అందించిన స్టడీ మెటీరియల్‌ను డీఈఓ రవీందర్‌రెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే నేరడ జెడ్పీ హైస్కూల్‌లో సైతం విద్యార్థులకు అక్కడి దాతల సహకారంతో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. లిటిల్ టీచర్ కాన్సెప్ట్ వల్ల విద్యారుల సామర్థ్యాలను పంచవచ్చన్నారు. దాతలు అందించిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు బాగా చదువుకుని ఎక్కువ మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, హెచ్‌ఎం ఎండీ వాహిద్, ఉపాధ్యాయులు నాగులపాటి నాగయ్య, రిటైర్డ్ టీచర్ సైదులు, సైన్స్ అధికారి అప్పారావు, స్టాఫ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల ఆర్డర్లు ఇవ్వాలని ఆందోళన



నెహ్రూసెంటర్: విద్యుత్‌శాఖలో ప్రమోషన్ల ఆర్డర్ కాపీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారంటూ ఆ శాఖ ఉద్యోగులు శుక్రవారం రాత్రి ఎస్‌ఈ చాంబర్‌లో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. సాయంత్రం వరకు ఆర్డర్ కాపీలు ఇస్తామని ఎస్‌ఈ చెప్పారని, కాసేపటి తర్వాత కోర్టు కేసు ఉందని, ఆర్డర్లు ఇవ్వలేమని చెప్పారని తెలిపారు. సోమవారం వరకు ఇస్తామని చెబుతున్నారని, ఆరోజు ఇవ్వకపోతే ఆందోళన చేపడుతామని ఉద్యోగులు హెచ్చరించారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఎస్‌ఈని వివరణ కోరగా కోర్టు కేసు విషయంలో క్లారిఫికేషన్ కోసం నిలిపివేశామని, క్లారిటీ వచ్చాక ఆర్డర్ కాపీలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు డి.రవికుమార్, రాంరెడ్డి, జంపిరావు, వీరప్రసాద్ పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సన్నద్ధం



గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు

- క్షేత్రస్థాయి పనులు పూర్తి చేసిన అధికారులు
- అందుబాటులోకి బ్యాలెట్ బాక్సులు
- తుది ఓటరు జాబితా విడుదల
- చివరి దశకు పోలింగ్ స్టేషన్ల గుర్తింపు

సాక్షి, మహబూబాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. పంచాయతీ ఎన్నికలు బ్యాలెట్ విధానంలో జరగనుండగా.. అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకుంటున్నారు. జిల్లాలో 461 పాత గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇటీవల మరో 12 కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయి. మొత్తంగా 473 జీపీల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి. అందుకు ఓటరు జాబితా విడుదల చేయగా.. పోలింగ్‌స్టేషన్ల గుర్తింపు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. కాగా ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు యంత్రాంగం సంసిద్ధంగా ఉంది.



అదనంగా బ్యాలెట్ బాక్సులు..

జిల్లాలో గత ఎన్నికల వివరాల ప్రకారం 4,056 వార్డులు ఉన్నాయి. అయితే ప్రస్తుతం పెరిగిన ఓటు బ్యాంకు ఆధారంగా వార్డులు పెరిగే అవకాశం ఉంది. కాగా 20శాతం అదనంగా బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకుంటున్నారు. మూడు విడతల్లో జీపీ ఎన్నికలు జరగనున్నాయి. విడతకు 2,977 బ్యాలెట్ బాక్సులు అవసరమని అధికారులు లెక్కలు వేశారు. ఇందుకోసం గతంలో ఎన్నికల నిర్వహణకు వినియోగించిన బాక్సుల్లో 1,462 పనికొస్తాయి. మిగిలినవి ఏపీ, మేడ్చల్ మల్కాజ్‌గిరి, ములుగు తదితర జిల్లాల నుంచి 1,800 తెప్పించారు.

ఓటరు జాబితా..

ఎన్నికల్లో కీలకమైన ఓటరు జాబితాను అధికారులు సిద్ధం చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో విడుదల చేసిన జాబితాకు కొత్త ఓటర్లను జోడించారు. నవంబర్ మొదటి వారంలో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసి అన్ని పంచాయతీల్లో ప్రదర్శించారు. నవంబర్ 30న తుది జాబితాను ప్రకటించారు. ఈమేరకు 2,76,608 మంది పురుషులు, 2,85,856 మంది మహిళలు, 25 మంది ఇతరులు మొత్తంగా 5,62,489 మంది ఓటర్లు ఉన్నారు. అదేవిధంగా జిల్లాలోని వార్డుల వారీగా పోలింగ్ బూత్‌ల గుర్తింపుపై ఈనెల 10న జిల్లా స్థాయి, 12న మండల స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వివరించారు. అభ్యంతరాలు ఉంటే చెప్పాలని అన్నారు. పోలింగ్ బూత్‌ల తుది జాబితా ఈనెల 17న ప్రకటించనున్నారు. అదేవిధంగా నామినేషన్ల స్వీకరణ క్లస్టర్ల గుర్తింపు, ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం ఉద్యోగులు, సిబ్బంది ఎంపిక కోసం జాబితాను సిద్ధం చేస్తున్నారు.

రిజర్వేషన్లపై చర్చ

గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల రిజర్వేషన్‌పై జిల్లాలో చర్చగా మారింది. 2018లో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రకారం అయితే గత రిజర్వేషన్ ఉంటుందని పలువులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర సర్వేలో కుల గణన కూడా ఉండటం.. దీని ఆధారంగా రిజర్వేషన్ ఉంటుందనే చర్చ కూడా జరుగుతోంది. ఈ విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదని, ఒకవేళ రిజర్వేషన్ మారితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిజర్వేషన్లు కేటాయించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



ముందస్తు ప్రక్రియను పూర్తి చేస్తున్నాం..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల పనుల్లో ఉన్నాం. బ్యాలెట్ బాక్సుల సిద్ధం చేశాం. ఓటరు జాబితా, వార్డులు, ఇతర పనులు పూర్తి చేశాం. మూడు విడతలుగా జరిగే ఎన్నికలకు కావాల్సిన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశాం . జిల్లాలో ఉన్న బాక్సులకు తోడుగా ఏపీ, ఇతర ప్రాంతాల నుంచి తెప్పించాం. రాజకీయ పార్టీలతో సమీక్షలు నిర్వహించాం. ఒక్కో పని పూర్తి చేస్తూ ముందుకు వెళ్తున్నాం.

- హరిప్రసాద్, డీపీఓ, మహబూబాబాద్

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ



మాట్లాడుతున్న జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ, పాల్గొన్న జడ్జి సురేష్

మహబూబాబాద్ రూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి.రవీంద్రశర్మ కక్షిదారులకు పిలుపునిచ్చారు. జిల్లా కోర్టులో శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ మాట్లాడుతూ.. నేడు (శనివారం) జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో వేల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అన్ని కేసులను సాధారణ పద్ధతిలో పరిష్కరించడం సాధ్యంకాదన్నారు. అందువల్ల లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. రాజీపడదగే క్రిమినల్, సివిల్, భూతగాదా, మోటార్ వాహన ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదా కేసులు, బ్యాంక్, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్ చోరీ (దొంగతనాలు), ట్రాఫిక్, ఈ–చలాన్ కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కక్షిదారులు రాజీ కుదుర్చుకుని కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సి.సురేష్ మాట్లాడారు.

విద్యతోనే సమాజంలో గౌరవం

- అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

మహబూబాబాద్: విద్యతోనే సమాజంలో గౌరవంతో పాటు అభివృద్ధి సాధ్యమని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పో అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు జరిగే ప్రేరణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ... పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను మొదటిస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి, సభ్యులు డేవిడ్, ఎలియా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలి

బయ్యారం: ఇనుపరాయి గనులున్న బయ్యారంలో ఉక్కు పరిశ్రమను నిర్మించాల్సిందేనని ఉక్కు పరిశ్రమ సాధన కమిటీ కన్వీనర్ గౌని ఐలయ్య అన్నారు. శుక్రవారం బయ్యారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి కిషన్‌రెడ్డి బయ్యారంలో ఉక్కుపరిశ్రమ నిర్మాణం సాధ్యం కాదని రాతపూర్వకంగా తెలయజేయడం సరికాదన్నారు. బయ్యారంలో ఉక్కుపరిశ్రమ నిర్మాణానికి అవసరమైన అన్ని వనరులు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం కుంటిసాకులు చెబూతూ పరిశ్రమ నిర్మాణం సాధ్యం కాదనడం దుర్మార్గమన్నారు. బయ్యారంలో ఉక్కుపరిశ్రమ నిర్మాణం చేయకుంటే బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మహబూబాబాద్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సర్వే పరిశీలనకు జిల్లాస్థాయి ప్రత్యేక అధికారుల నియమించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనలో లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా కచ్చితమైన సమాచారం సేకరించాలన్నారు. ఇందిరమ్మ పథకం మోడల్ గృహాలను అన్ని మండల కేంద్రాల్లో నిర్మిస్తామన్నారు. జిల్లాలో 487 గ్రామపంచాయతీ, 82 పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. వివరాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు కోసం జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తుందన్నారు.

ఏర్పాట్లు పూర్తి..

ఈనెల 14న అన్ని వసతి గృహాల్లో 40శాతం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశామని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక అధికారులు, సంబంధిత సిబ్బంది కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా వారికి కేటాయించిన వసతి గృహాల్లో ఏర్పాట్లను పరిశీలించారని పేర్కొన్నారు. కార్యక్రమానికి వచ్చే ముఖ్య అతిథులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానం పంపించామన్నారు.

జాతీయ కార్యక్రమాలను అమలు చేయండి

- డీఎంహెచ్‌ఓ మురళీధర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మురళీధర్

నెహ్రూసెంటర్: వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది జాతీయ కార్యక్రమాలను వందశాతం అమలు చేయాలని డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం జాతీయ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. జాతీయ కార్యక్రమాల్లో భాగంగా మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం, చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్, అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం, లెప్రసీ, మలేరియా, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. గర్భిణుల నమోదు, రక్తహీనత గల గర్భిణుల గుర్తింపుతో పాటు పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. పిల్లలందరికీ టీకాలు వేసేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ కార్యక్రమాల అమలులో జిల్లాను ముందుంచాలని కోరారు. నూతనంగా వచ్చిన వైద్యాధికారులను పరిచయం చేసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రమీల పీఓలు సుధీర్‌రెడ్డి, సారంగం, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, విజయ్ కుమార్, హెల్త్ ఎడ్యూకేటర్స్ కేవీ రాజు, గీత ఉన్నారు.

దుమ్ము లేస్తోంది..



భారీ లోడ్‌తో టిప్పర్ వెళ్తుండగా లేస్తున్న దుమ్ము

- కేసముద్రంలో రైల్వే థర్డ్‌లైన్, రోడ్డు విస్తరణ పనులు
- భారీ వాహనాల రాకపోకలతో ఎగిసిపడుతున్న దుమ్ము
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న దుకాణాదారులు, ప్రజలు

కేసముద్రం: మండల కేంద్రంలో రైల్వే థర్డ్‌లైన్ పనులు,రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. ఈ పనుల్లో భాగంగా నిత్యం టిప్పర్‌లు కంకర, మట్టిని తరలిస్తుండడం, వ్యవసాయ మార్కెట్, పలు రైస్‌మిల్లుల నుంచి భారీ లోడ్‌తో లారీలు వెళ్తుండటంతో దుమ్ము లేస్తోంది. దీంతో కేసముద్రంస్టేషన్ నుంచి కేసముద్రంవిలేజ్ వరకు, ఉప్పరపల్లి రోడ్డు నుంచి జ్యోతిరావుపూలే సెంటర్ వరకు రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణాదారులు, చిరువ్యాపారులు, స్థానికులు దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. బాటసారులు, ద్విచక్రవాహనాదారులు భారీ వాహనాల వెనకాల వెళ్లలేని పరిస్థితి ఉంది. కాసేపు ఆగి వెళ్తున్నారు. ప్రతీరోజు ఇదే పరిస్థితి ఉండడంతో కొందరు దుకాణాదారులు మాస్కులు ధరిస్తున్నారు. ఇలానే కొనసాగితే తమ ఆరోగ్యం దెబ్బతింటుందని స్థానికు వాపోతున్నారు. ట్రాక్టర్ సాయంతో నీళ్లను చల్లిస్తే దుమ్ము లేవడం తగ్గుతుందని స్థానికులు కోరుతున్నారు.

దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం..



ప్రతీరోజు ఉదయం నుంచి రాత్రి వరకు టిప్పర్‌లు, లారీలు ప్రధాన రహదారిపై తిరుగుతుండటంతో దుమ్ము లేస్తోంది. షాపులో కూర్చోలేకపోతున్నం. రోడ్డు మీదకు వస్తే కళ్లలో ధూళి పడుతుంది. మా సెంటర్‌లో ఉన్న దుకాణాల్లో దుమ్ము పడుతుంది. మాతోపాటు హోటళ్లు, పండ్ల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు ట్రాక్టర్ సాయంతో నీళ్లను చల్లిస్తే, దుమ్ము లేవకుండా ఉంటుంది.

- ఎండి.అసీమ్‌అలీ, మెడికల్‌షాపు యజమాని, కేసముద్రంస్టేషన్

సమస్యల స్వాగతం

- కొలువుదీరిన ధర్మకర్తల మండలి
- కురవి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించాలి

కురవి: రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన శైవ పుణ్యక్షేత్రమైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో పలు సమస్యలు వేధిస్తున్నాయి. అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా అడుగులు పడటం లేదు. కాగా శుక్రవారం కొలువుదీరిన ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.

నామమాత్రంగానే..

ఏళ్లుగా ఆలయ అభివృద్ధి పనులు నామమాత్రంగానే చేపడుతున్నారు. మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. మూడు నెలలపాటు జాతర కనులపండువగా జరుగుతుంది. వీరన్నను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. వేలమంది భక్తులకు సరిపడా సౌకర్యాలు, వసతులు కల్పించాల్సిన బాధ్యత ధర్మకర్తల మండలి సభ్యులపై ఉంది.



భద్రకాళీ సమేత వీరభద్రస్వామి మూలవిరాట్



వీరభద్రస్వామి ఆలయం

స్థలం కొరత..

వీరభద్రస్వామి ఆలయానికి స్థలం కొరత తీవ్రంగా ఉంది. దీంతో అభివృద్ధి పనులు చేయాలంటే ఇబ్బందిగా మారింది. ఆలయ అధికారులు రెవెన్యూ అధికారులకు ఎన్నో మార్లు స్థలం కోసం మొరపెట్టుకున్నారు. స్థలాన్ని చూడాల్సిన అవసరం ఉంది.

పెండింగ్ పనులకు మోక్షం కలిగేనా?

మాజీ సీఎం కేసీఆర్ ఆలయ అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు చేయడంతో కొంతమేరకు అభివృద్ధి జరిగింది. ఆ నిధులతో మొత్తం పనులు పూర్తికాలేదు. దీంతో గెస్ట్ హౌస్ నిర్మాణం, రథానికి నీడనిచ్చేందుకు రథశాల, యాగశాల నిర్మాణాలను ఇంకా మొదలు పెట్టలేదు. దీంతో ఆ నిధులు వెనక్కి వెళ్లినట్లు తెలుస్తోంది. అప్పటి కాంట్రాక్టర్ పనులు చేయలేదు. దీంతో భక్తులకు సౌకర్యాలు మెరుగుపడలేదు. కాగా, పెండింగ్ పనులకు మోక్షం కలిగించేలా చూడాలి.

పాత కాటేజీలు శిథిలం..

దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయ కాటేజీలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏ, బీ సెక్షన్‌లోని గదులను పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మాణం చేయాల్సి ఉంది. భక్తులకు సరిపడా గదులు లేకుండా పోయాయి. కొత్తగా నిర్మించిన గదుల్లో సౌకర్యాలు సరిగా లేవు.

అభివృద్ధి కోసం స్టడీ చేస్తా..

చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించా. ఈఓతోపాటు ధర్మకర్తలతో కలిసి ఆలయ అభివృద్ధి కోసం స్టడీ చేయాల్సి ఉంది. భక్తులకు గదుల సౌకర్యాలు కల్పిస్తాం. హరిత హోటల్ నిర్మాణం కోసం కృషి చేస్తా. పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటా. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు పాటుపడుతా.

- కొర్ను రవీందర్‌రెడ్డి, చైర్మన్

నేడు డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపు సంబురాలు

- విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానం



మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం 40శాతం డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో నేడు(శనివారం) జిల్లాలోని 125 విద్యా సంస్థల్లో సంబురాలు నిర్వహించనున్నారు. ఈమేరకు సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్నం సహపంక్తి భోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈమేరకు వసతి గృహాల వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానాలు పంపారు. పాఠశాలలు, వసతి గృహాల్లో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు శుక్రవారం హాస్టళ్లు, పాఠశాలలను సందర్శించి తనిఖీలు చేశారు.

ముమ్మరంగా 'ఇంటింటికీ సీపీఎం'

- ప్రజా సమస్యలపై సర్వే చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా సమస్యలపై సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సమ్మెట రాజమౌళి, శాగంటి భాగ్యమ్మ, కుమ్మరికుంట్ల నాగన్న, ఎండి రజాక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వార్డుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని, వార్డుల్లో పేరుకుపోయిన సమస్యల్ని పరిష్కరించేలా పాలకులు, అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. పేదల పక్షాన సీపీఎం పోరాడుతుందని చెప్పారు. నాయకులు రమేష్, బాలు, విజయ, మనీ, శ్యామ్, వీరన్న, సుధాకర్, ఉపేంద్ర బాబుమియా, లీల, రఫీ, కవిత, కృష్ణ, రమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అరుణాచలం గిరిప్రదక్షిణకు ఆర్టీసీ బస్సు



అరుణాచలం బస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ ఆర్‌ఎం మాధవరావు

హన్మకొండ: అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతీ నెల బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ ఆర్‌ఎం మాధవరావు తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి భక్తులతో అరుణాచలం వెళ్తున్న బస్సును డిప్యూటీ ఆర్‌ఎం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం దేవాలయాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందన్నారు. ఈసౌకర్యాన్ని భక్తులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 15వ తేదీన వరంగల్ జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రైస్ కుమార్‌యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-16, 18, 20 బాలబాలికలతోపాటు మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగే 10వ రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పాల్గొంటారని తెలిపారు. అండర్-16 బాలబాలికలకు 2 కిలోమీటర్ల రన్నింగ్, అండర్-18 కేటగిరీలో 4 కిలోమీటర్ల రన్నింగ్, అండర్-20 కేటగిరీ క్రీడాకారులకు 6 కేఎం రన్నింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. మెన్ అండ్ ఉమెన్ సీనియర్ క్రీడాకారులకు 10కేఎం రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో ఆదివారం ఉదయం 8గంటలకు జేఎన్‌ఎస్‌లోని సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ వద్ద రిపోర్టు చేయాలని తెలిపారు. ఇతర వివరాలకు ఊర యుగెందర్‌రెడ్డి 98665 64422, బండి కృష్ణమూర్తి 90003 54465 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

సరదాగా స్నేహితులతో కలిసి సినిమాలు, షికార్లు చేసే వయస్సులో చెస్‌లో జగజ్జేతగా నిలిచాడు. 18 సంవత్సరాల అతి పిన్న వయస్సులో కలలో కూడా ఊహించని చరిత్రను తిరగరాశాడు. భారత ఖ్యాతిని మరోసారి విశ్వవ్యాప్తి చేశాడు. కుర్రాడిగా పావులు కదుపుతూ సీనియర్ క్రీడాకారుడిని ఖంగుతినిపించి ప్రపంచ మేధావుల దృష్టిని ఆకర్షించాడు. అతనెవరో కాదు దొమ్మరాజు గుకేశ్. ఇప్పుడు ఎక్కడ ఏ ఇద్దరు కలిసినా.. చెస్‌లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన గుకేశ్ గురించే చర్చ. ఈ నేపథ్యంలో గుకేశ్ ఆటలో ఎత్తుగడలు, విజయం సాధించిన తీరు, తదితర అంశాలపై ఉమ్మడి జిల్లా చెస్ క్రీడాకారులు, క్రీడాభిమానుల మనోగతం 'సాక్షి' పాఠకుల కోసం. - వరంగల్ స్పోర్ట్స్

చదరంగ కీర్తి.. గుకేశ్ స్ఫూర్తి



యువ చెస్ క్రీడాకారుల్లో నూతనోత్తేజం

- బాల్యం నుంచే రాణిస్తున్న చిన్నారులు
- గుకేశ్ విజయంపై హర్షాతిరేకాలు
- 'సాక్షి'తో అభిప్రాయాలను పంచుకున్న క్రీడాకారులు

అద్భుత విజయం

అతి చిన్న వయస్సులో గుకేశ్ ప్రపంచ విజేతగా నిలవడం అసాధారణ విషయం. మాలాంటి క్రీడాకారులకు స్ఫూర్తిని అందించాడు. విశ్వవిజేతగా విశ్వనాథన్ ఆనంద్ తర్వాత గుకేశ్ సాధించిన విజయం మాటల్లో చెప్పలేని అద్భుతం. గుకేశ్ ఆట తీరును చాలా సార్లు దగ్గరి నుంచి చూశాను. ప్రపంచ రికార్డు సమయంలో ఆడిన ఆట అందుకు భిన్నంగా ఉంది. వేసే ప్రతి అడుగు ప్రత్యర్థిని ఇరుకున పెట్టేలా ఉంది. గుకేశ్ ఆత్మవిశ్వాసం, ఆట తీరు నాలో మరిన్ని విజయాలు సాధించాలన్న పట్టుదలను నింపాయి.

- వేల్పుల సరయు, మొండ్రాయి, వరంగల్, అంతర్జాతీయ క్రీడాకారిణి



ఆరేళ్లకు ఎలో రేటింగ్



రెండు సంవత్సరాలుగా చెస్ నేర్చుకుంటున్నాను. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన చెస్ టోర్నీలో ర్యాపిడో విభాగంలో దేశ వ్యాప్తంగా 1,485వ ఎలో రేటింగ్ వచ్చింది. మా అమ్మనాన్న చాలా సంతోషపడ్డారు. ఈ రోజు పేపర్లలో గుకేశ్ ఫొటోలు చూపించి, అతని గురించి వివరిస్తుంటే.. నేను కూడా ప్రపంచ విజేత కావాలనే ఆకాంక్ష పెరిగింది. రాంనగర్‌లోని మాంటిస్సోరి స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్న దేవాన్ష్‌రెడ్డి, ఆరేళ్ల వయస్సులోనే జాతీయ స్థాయి రేటింగ్ రావడం విశేషం.

- దేవాన్ష్‌రెడ్డి, రాంనగర్

గుకేశ్ ఆటతీరు నచ్చింది



పదేళ్లుగా చెస్‌లో శిక్షణ పొందుతున్నాను. చాలా మంది గ్రాండ్ మాస్టర్ల ఆటను చూసేవాడిని. విశ్వనాథ్ ఆనంద్, కోనేరు హంపి, ఇరిగేసి అర్జున్ టోర్నమెంట్లను చూశాను. ఒక్కొక్కరిదీ ఒక్కో స్టైల్, గుకేశ్ స్టైల్ కళ్లు తిప్పుకోకుండా చేసింది. ఆయన ఆడిన టోర్నమెంట్ వీడియోలు చూస్తూనే ఉన్నాను. ఆయన స్ఫూర్తితో ఉన్నత స్థాయి టోర్నమెంట్లలో విజేతగా నిలిచేందుకు శ్రమిస్తా.

- బి.విశ్వజిత్‌సాయి, హనుమకొండ

నేనే ఆడినట్లుగా టెన్షన్ పడ్డాను



ప్రపంచ స్థాయి వేదికగా గుకేశ్ ఆడుతుంటే నేనే అక్కడ కూర్చుని ఆడినట్లుగా టెన్షన్ పడ్డాను. ఆటముగిసే వరకు మా స్నేహితులం ప్రతిక్షణం ఆసక్తిగా వీక్షించాం. నాలుగు గంటలకు పైగా సాగిన ఆ ఆటలో గుకేశ్ విజయం సాధించడం నేను ఎన్నటికీ మరిచిపోలేను. గుకేశ్ ఆట తీరు, ఆయన ఆత్మవిశ్వాసం నాకెంతో స్ఫూర్తిని అందించాయి.

- సూర్యప్రతాప్‌కోటి, 8వ తరగతి, వరంగల్

మిస్టరీ వీడేనా?

- ఏడాది క్రితం నగరంలో అనుమానాస్పదంగా విజయ మృతి
- నేటికీ చిక్కని నిందితుల జాడ
- వంద మందిని విచారించిన పోలీసులు



కోన విజయ (ఫైల్)

కాజీపేట: ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు కిరాతకంగా కొట్టి చంపి ఏడాది కాలం గడిచినా.. హంతకుల ఆనవాళ్లు పోలీసులకు చిక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణం 62వ డివిజన్ రహమత్ నగర్ కాలనీలో ఉండే కోన విజయ (68) అనే మహిళ గత ఏడాది డిసెంబర్ 14న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి అర్ధరాత్రి విగతజీవిగా ఇంటి పక్క సందులో కనిపించింది. విజయ మృతదేహంపై దుస్తులు సరిగ్గా లేకపోవడంతోపాటు బంగారు నగలు కనిపించకుండాపోయాయి. వెంటనే స్థానికుల సాయంతో విజయ కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విభిన్న కోణాల్లో పోలీసుల విచారణ..

పోలీసు అధికారులు కేసు నమోదు చేసి క్లూస్ టీం సభ్యులు, డ్వాగ్ స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన విజయ దాదాపు 16 గంటలపాటు పట్టణంలో ఎక్కడ ఉంది.. ఒంటిపై ఉన్న బంగారు నగల కోసమే నిందితులు హత్యచేసి ఇంటి వద్ద పడేసి ఉంటారా.. లేక తెల్సిన వాళ్లకు అప్పుడప్పుడు చిన్న మొత్తంలో నగదును ఇస్తుండే విజయను మరెవరైనా హత్య చేశారా.. అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టినా ఆచూకీ లభించలేదు. అయితే .. విజయను ఏమార్చి కిడ్నాప్ చేసిన నిందితులు తలపై బలంగా కొట్టి చంపడంతోపాటు శరీరాన్ని పూర్తిగా సబ్బు పెట్టి కడిగి మృతురాలి ఇంటి పక్కన ఉన్న గల్లీలోనే అర్ధరాత్రి వేళ పడేసి వెళ్లారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో వెతికినా హత్య ప్రదేశాన్ని గుర్తించకుండా ఉండేందుకు నిందితులు సబ్బుతో కడిగి ఉంటారనే అభిప్రాయం వ్యక్తమైంది. మృతురాలి శరీరంపై ఉన్న బంగారు నగల కోసమే హత్య చేసి ఉంటారా లేక ఇతర కారణాలు ఏమైనా ఉండి ఉంటాయా.. అనే కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నప్పటికీ పోలీసులకు నిందితులకు సంబంధించిన ఆచూకీ చిక్కకపోవడం అందరిని ఆశ్చర్యం కలిగిస్తుంది. హత్య జరిగినప్పుడు ఉన్న అధికారులు బదిలీపై వెళ్లడంతో కొత్తగా వచ్చిన అధికారులు హత్య కేసు ఫైల్‌ను తిరిగి తెరచి విచారణ జరుపుతున్నారు. ఘటనా సమయంలో ఉన్న అధికారులు ఒక క్రమపద్ధతిలో విచారణ చేయకపోవడం కారణంగానే సమస్య తీవ్రత పెరగడంతోపాటు నిందితులు దొరక్కుండా చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఇప్పటి వరకు సుమారు 100మందిని విచారించారు. చిన్న క్లూ దొరికినా విడిచి పెట్టకుండా నేరస్తుల ఆట కట్టిస్తున్న పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది. విజయ కేసులో నానాటికీ చిక్కుముడులు పెరుగుతున్నాయి. మొదట్లో కేసును సునాయాసంగా పరిష్కరించవచ్చని భావించిన పోలీసులకు గతంలో వచ్చిన దృశ్యం సినిమాను జ్ఞప్తికి తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. సీపీ అంబర్ కిశోర్ ఝా క్రైమ్ సమీక్ష సమావేశాల్లో తరచూ ఈ కేసును పరిష్కరించాలంటూ ఆదేశిస్తున్నప్పటికీ పోలీసుల విచారణ ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది.

ఉద్యాన పంటలకు మంచి భవిష్యత్

- ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ రాజిరెడ్డి
- మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ సందర్శన



జామతోట మదర్ బ్లాకును ప్రారంభిస్తున్న వీసీ రాజిరెడ్డి

మహబూబాబాద్ రూరల్: ఉద్యాన పంటలకు మంచి భవిష్యత్ ఉందని, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి రైతులు పంటలను కాపాడుకోవాలని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ (వీసీ) డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామంలోని జెన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యాన పరిశోధన స్థానాన్ని వీసీ శుక్రవారం సందర్శించారు. పరిశోధనలను గురించి అడిగి తెలుసుకుని, జామ, మామిడి, సపోట, పసుపు తోటలను, మిర్చి క్షేత్రాలను సందర్శించి, జామతోట నూతన మదర్ బ్లాకులో మొక్కలునాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉద్యాన పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధునిక సాంకేతికతో అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నాయన్నారు. సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టి నల్ల తామర పురుగులను అరికట్టి మిర్చి పంటను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. మల్యాల పరిశోధన స్థానం నుంచి అలహాబాద్ సఫేదా జామ రకం, కరొండ రకానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందన్నారు. మల్యాల గ్రామ మాజీ సర్పంచ్ ఆవుల కుమారివెంకన్న తమ జీపీకి స్థలం కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కత్తుల నాగరాజు, విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల అసోసియేట్ డీన్ చీనానాయక్, కేవీకే శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, రాంబాబు, అభ్యుదయ రైతులు సోల్లేటి జైపాల్ రెడ్డి, వల్లూరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొర్ల దొంగలు దొరికారు..!

- వివరాలు వెల్లడించిన పరకాల ఏసీపీ సతీశ్‌బాబు

దామెర: జల్సాలకు అలవాటుపడి గొర్లు, మేకలను దొంగిస్తున్న బృందం సభ్యులను దామెర పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు పంపారు. పరకాల ఏసీపీ సతీశ్‌బాబు దామెర పోలీస్ స్టేషన్‌లో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని నిజాంపల్లికి చెందిన బొమ్మ తిరుపతి, ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని చల్వాయికి చెందిన మల్ల భరత్, వరంగల్ మండలంలోని కొత్తపేటకు చెందిన వంగూరి మధు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన కొత్తకొండ వికాస్ గ్రూప్‌గా ఏర్పడి మొదట్లో చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. అనంతరం కొత్తకొండ వికాస్ లాంగ్ డ్రైవ్ కోసం కార్లను తీసుకొని గొర్లు, మేకలను దొంగిలిస్తే ఎవరికీ అనుమానం రాదని మిగితా మిత్రులకు వివరించాడు. దీంతో లాంగ్ డ్రైవ్ కోసం కార్లను అద్దెకు తీసుకొని పలుచోట్ల గొర్లు, మేకలను దొంగిలించి హైదరాబాద్, వరంగల్ సంతల్లో అమ్మి వచ్చిన సొమ్ముతో ఎంజాయ్ చేసేవారు. ఈ క్రమంలో తిరుపతి, భరత్, వికాస్ ఈ నెల 9 తెల్లవారు జామున మండలంలోని కోగిల్వాయికి కారులో వచ్చి గొర్లను దొంగిలిస్తుండగా గ్రామానికి చెందిన జంగిలి రవి.. వికాస్‌ను గట్టిగా పట్టుకొని అరవడంతో వికాస్.. రవిపై రాయితో దాడిచేశాడు. ఆ తర్వాత కారును, సెల్ ఫోన్ వదిలి ముగ్గురు పారిపోయారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో వదిలి వెళ్లిన కారును తీసుకెళ్లేందుకు నిందితులు శుక్రవారం గ్రామానికి రాగా.. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికిచేరుకొని తిరుపతి, భరత్, మధును అరెస్టుచేసి రూ.3 లక్షలు, 4 సెల్ ఫోన్లు, బెలెనో కారు సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కొత్తకొండ వికాస్ పరారీలో ఉండగా అతన్ని త్వరలోనే పట్టుకుంటామన్నారు. వీరిపై గతంలో 10 కేసులు నమోదు కాగా 63 జీవాలను దొంగతనం చేయగా వాటి విలువ సుమారు రూ.4,98,000 ఉంటుందని ఏసీపీ పేర్కొన్నారు. సమావేశంలో పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, ఎస్సై అశోక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



దామెరలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు

పాము కాటుతో వ్యక్తి మృతి

- వైద్యసిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



సోమేశ్వరావు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య మాధవి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని తానిపర్తి గ్రామానికి చెందిన వ్యక్తి శుక్రవారం పాము కాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. తానిపర్తికి చెందిన సోమేశ్వరావు(38) తన మిర్చి తోటలో గడ్డి తొలగిస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు సోమేశ్వరావును వెంకటాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి తీసుకొచ్చిన గంట తర్వాత వైద్య సిబ్బంది చికిత్స ప్రారంభించారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది, అధికారులు సకాలంలో వైద్యం చేయకపోవడంతోపాటు ఏటూరునాగారం వైద్యశాలకు రిఫర్ చేశారని తెలిపారు. సోమేశ్వరావును ఏటూరునాగారం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని వెంకటాపురం ఆస్పత్రికి తీసుకొచ్చి సిబ్బంది నిర్లక్ష్యంతోనే సోమేశ్వరావు మృతి చెందారని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి రావు ఆస్పత్రి వద్దకు వచ్చి బంధువులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గకేసు ^మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీర జవాన్‌కు ఘననివాళి

గూడూరు: విధి నిర్వహణలో గుండెనొప్పితో మృతిచెందిన వీర జవాన్ గుగులోతు రమేశ్‌నాయక్ మృతదేహానికి శుక్రవారం రాత్రి గూడూరు మండల కేంద్రంలో పలువురు నాయకులు, యువకులు ర్యాలీగా వెళ్లి, టపాసులు కాల్చి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ ఖానాపురం మండలం వేపచెట్టుతండా శివారు కోమటిపల్లి తండాకు చెందిన గుగులోతు రమేశ్ నాయక్ (36) 13 సంవత్సరాల క్రితం సీఆర్‌పీఎఫ్‌గా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం విధుల్లో ఉండగా గుండెనొప్పితో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని పోలీసు లాంఛనాలతో సైనికులు తీసుకొస్తుండగా రాత్రి 7 గంటలకు గూడూరుకు చేరుకుంది. ప్రధాన సెంటర్‌లో పలువురు పూలమాలలు వేసి, టపాసులు పేల్చి నివాళులర్పించారు.

గ్రామానికి చేరిన జవాన్ మృతదేహం



గూడూరులో వీరజవాన్‌కు ర్యాలీతో నివాళులర్పిస్తున్న ప్రజలు, నాయకులు

ఖానాపురం: మండలంలోని కోమటిపల్లితండాకు చెందిన ఆర్మీ జవాన్ గుగులోతు రమేశ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. కాగా ఆర్మీ అధికారులు శుక్రవారం ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రమేశ్ మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. రమేశ్ మృతదేహం వద్ద పలువురు నివాళులర్పించారు.

రైల్వే ఎన్నికల ఫలితాల వెల్లడి

- రైల్వే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్, సంఘ్‌కు గుర్తింపు



సంబురాల్లో పాల్గొన్న మజ్దూర్ యూనియన్ నాయకులు

కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే పరిధితోపాటు కాజీపేటలో ఈ నెల 4, 5, 6వ తేదీల్లో ట్రేడ్ యూనియన్ల గుర్తింపు కోసం ఎన్నికలు జరగ్గా గురువారం ఫలితాలు వెల్లడించినట్లు శుక్రవారం రైల్వే మజ్దూర్, రైల్వే సంఘ్ నాయకులు తెలిపారు. ఈ ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గెలుపొంది రైల్వేలో గుర్తింపు పొందాయి. రైల్వే ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌లను రైల్వే కార్మికులు ఆదరించి గెలిపించినట్లు ఆయా ట్రేడ్‌యూనియన్ల నాయకులు అన్నారు.

డీజిల్‌షెడ్‌లో సంబురాలు

కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో శుక్రవారం రైల్వే ఎన్నికల్లో దక్షిణమధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా రైల్వే మజ్దూర్ యూనియన్ గుర్తింపు సాధించినందుకు రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్‌బ్రాంచ్ ఆధ్వర్యంలో కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసినట్లు రైల్వే మజ్దూర్ యూనియన్ డిజిల్ బ్రాంచ్ ట్రెజరర్ గిరిమిట్ల రాజేశ్వర్‌రావు తెలిపారు. అనంతరం షెడ్ ఆవరణలో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- రైల్వే జీఎంకు రైల్వే జేఏసీ వినతిపత్రం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్, కోచ్ ఫ్యాక్టరీ తనిఖీ నిమిత్తం వచ్చిన రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌ను శుక్రవారం రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు ఆధ్వర్యంలో 15 సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కాజీపేట రైల్వే పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందులో భాగంగా కాజీపేటను రైల్వే డివిజన్ చేయాలని, రైల్వే ఆస్పత్రిని సబ్‌డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, వ్యాగన్ పనులు వేగంగా చేపట్టాలని కోరారు. కాజీపేట టౌన్ స్టేషన్‌ను చర్లపల్లిమాదిరి రైల్వే కారిడార్‌గా చేయాలని, కాజీపేటలో ఎలక్ట్రిక్ పీఓహెచ్‌ను నిర్మించాలని, 138 ఏళ్ల నాటి రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌కు నూతన భవనం మంజూరు చేయాలని, రైల్వే స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మించాలని కోరారు. ఇండోర్ షటిల్‌కోర్టును ఉడెన్‌గా మార్చాలని, కాజీపేట కార్మికుల కోసం స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు చేయాలని, రైల్వే స్టేడియానికి బయటవైపు పబ్లిక్‌టాయ్‌లెట్స్ నిర్మించాలని, రైల్వే కమ్యూనిటీహాల్‌లో ఏసీ నిర్మాణం చేసి రెండో డైనింగ్‌హాల్ నిర్మించాలని వినతి పత్రంలో కోరారు. రైల్వే జేఏసీ బృందం డి.రవీందర్, పి.రమేశ్, జి.భాస్కర్, ఎస్.లక్ష్మీనారాయణ, అనుమాల శ్రీనివాస్, టి.ప్రవీణ్, ఎం.మహేశ్, కె.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.




జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ బృందం

రాలిన ధాన్యం తిని గొర్రెలు మృతి

- మృతి చెందిన 23 గొర్రెల విలువ రూ.2.60 లక్షలు
- ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న మరో 62 గొర్రెలు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలో పొలంలో రాలిన ధాన్యం తిని గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గొర్రెల యజమానులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి(కన్నెపల్లి)లో అటవీమార్గం గుండా పందుల గుంపులుగా వచ్చి వరి పొలాన్ని తొక్కడంతో ధాన్యం(వడ్లు) రాలిపోయింది. దీంతో పొలం యజమానులు పంటను కొంతమేర కోయలేదు. కాగా, శుక్రవారం కాపర్లు మెట్‌పల్లి సమీప పొలాల్లోకి గొర్లను మేతకు తీసుకెళ్లారు. అక్కడ ధాన్యం తిన్న మొగిలి మధుకర్‌కు చెందిన 14 గొర్రెలు, మొగిలి శంకర్ 2, మొగిలి పర్వతాలు 2, మొగిలి కత్తరశాల 2, సల్వాల పెద్ద రాజన్న 3 గొర్రెలతో కలిపి మొత్తం 23 గొర్రెలు మృతి చెందాయి. మరో 62 గొర్రెలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు పేర్కొన్నారు. బాధితులు పశువైద్యులకు సమాచారం ఇవ్వడంతో మహదేవపూర్ పశువైద్యాధికారి రాజబాపు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న గొర్రెలకు వైద్యపరీక్షలు చేశారు. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ. 2.60 లక్షల వరకు ఉంటుందని బాధితులు వాపోయారు.



గొర్రెల కళేబరాలు

క్రికెట్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరగనున్న అండర్ - 14 ఇంటర్‌స్కూల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును శుక్రవారం వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ప్రకటించింది. హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో మొదట ప్రాబబుల్స్ జట్లను ఎంపిక చేసిన సెలక్టర్లు వారికి మూడు రోజులపాటు ప్రాక్టీస్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ప్రాక్టీస్ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచినవారిలో సెలక్టర్లు అఫ్జల్, రామకృష్ణ తుదిజట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా జట్టులో బి.సాత్విక్ (కెప్టెన్), ఓ.సుకుమార్, అశ్విత్, అద్వైతరెడ్డి, పి.హర్షిణి, ఎస్.త్రికరణ్, కె.రిషి, డి.జశ్వంత్, శీటి జీతర్ష్, ఎస్.మనీష్‌కుమార్, వి.రాఘవేందర్, బి. ఈశ్వర్‌తేజ్, బి.వశీకర్‌సాయి, ఎం. ప్రీతం, ఎస్.శ్రీతేజ్‌లకు స్థానం దక్కింది. జట్టు కోచ్‌గా అఫ్జల్, మేనేజర్‌గా ఆల్‌ఎల్ ప్రణయ్‌కుమార్‌లు వ్యవహరిస్తారని శ్రీనివాస్ తెలిపారు.